క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం తనిఖీ



వడ్డిపల్లె పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంఈఓ

సోమల: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ–1 శ్రీరాములు ఆదేశించారు. సోమవారం మండలంలోని వడ్డిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం, రికార్డులతో పాటు, మిడ్డే మీల్స్ రికార్డులు పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జీసీకే ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల సామగ్రి వితరణ



విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ చేస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

శాంతిపురం: పబ్లిక్ పరీక్షలు రాయనున్న కర్లగట్ట జెడ్పీ హైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు చిత్తూరుకు చెందిన అమృత భారతి ఫౌండేషన్ పరీక్షల సామగ్రి వితరణ చేసింది. సోమవారం 50 మంది విద్యార్థులకు అట్టలు, ఇన్‌స్ట్రుమెంటల్ బాక్సులు, పెద్దబాలశిక్ష పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించాలని స్థానిక ఎంపీటీసీ వెంకటాచలం ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి ప్రకాష్‌రెడ్డి, హెచ్‌ఎం నాదమునిరెడ్డి, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ రోజా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్ నివాళి



చిదంబరం మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: మండలంలోని గోనుమాకులపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిదంబరం సోమవారం మృతి చెందారు. ఇది తెలుసుకున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు వేర్వేరుగా గోనుమాకులపల్లెకు వచ్చారు. చిదంబరం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం



విరాళమిస్తున్న దాత

పలమనేరు: పట్టణంలోని శివాలయంలో రాజగోపుర నిర్మాణానికి స్థానిక క్రిష్ణవేణి రెడ్డెప్ప దంపతులు రూ.50 వేల విరాళాన్ని ఆలయ ఈఓ కమలాకర్‌కు సోమవారం అందజేశారు. దాతకు ఆలయ చైర్మన్ వీరభద్ర, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న నాయకులు

పలమనేరు: వైఎస్సార్ సీపీ యూత్ నాయకుడు హేమంత్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, బీసీ ఉద్యోగ సంఘ నేత లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఏపీ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



బంగారుపాళెం: ఏపీ డ్రైవర్స్‌అండ్ క్లీనర్స్ అసోషియేషన్ మండల నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసన్నకుమార్ నివాస గృహం ఆవరణలో సమావేశాన్ని నిర్వహించారు. మండల అధ్యక్షుడుగా చెంచుబాబు, ఉపాధ్యక్షుడుగా ఖాదర్‌బాషా, కోశాధికారిగా వెంకటేష్, కార్యదర్శిగా సుధాకర్‌తోపాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, ప్రయాణికులను గమ్యస్థానానికి చేరవేయడంలో డ్రైవర్లు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆదరించండి



మహిళలకు చీరలు అందజేస్తున్న దుర్గ

కుప్పం: పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలతో కుప్పం నియోజకవర్గాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్లిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని రాబోవు ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ కోరారు. సోమవారం మున్సిపాలిటీలోని 16వ వార్డు నేతాజీ రోడ్డులో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి పలకరించారు. మహిళలకు చీరలు, పసుపు, కుంకుమను సారె రూపేణా అందజేశారు. ఆమె మాట్లాడుతూ, కుప్పానికి 35 ఏళ్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్న చంద్రబాబునాయుడు తన పాలనలో చేసిందంటూ పెద్దగా ఏమీ లేదని, వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్లలోనే ఇక్కడ ఎంతో చేసిందనేది ప్రజలు గుర్తెరగాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ఏరోజు కూడా స్థానికులకు అందుబాటులో లేరని, తమ కుటుంబం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. తన దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను భరత్ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ప్రజలతో మమేకమవుతున్నారన్నారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని అసెంబ్లీ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి వైఎస్సార్ సీపీని మళ్లీ గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, స్థానిక కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపే లక్ష్యం



వి.కోట: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

వి.కోట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీపీ యువరాజు కోరారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుతం జగనన్న పాలనకు ఉన్న తేడాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రచారం చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఒక్కో ఇంటికి ఎంత లబ్ధి చేకూరిందో వివరంగా ప్రజలకు తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సంక్షేమ పథకాలే మనకు ఇప్పుడు ప్రచారాస్త్రాలుగా ప్రతిపక్షాలపై సంధిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బాలగురునాథ్, నాయకులు కృష్ణమూరి, సుధాకర్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు పాదరక్షలు, దుప్పట్లు పంపిణీ



కుష్ఠు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, మందులు పంపిణీ చేస్తున్న జిల్లా అధికారి దేవదాస్

సోమల: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని జిల్లా డిప్యూటీ కుష్ఠు వ్యాధి నివారణ అధికారి దేవదాస్ అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేసిన ఆయన కుష్ఠు వ్యాధిగ్రస్తుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. అనంతరం మండలంలోని ఎర్రనాగులవారిపల్లె, గంగిరెడ్డిగారిపల్లె, సోమల దళితవాడ ఇటుకల బట్టి, గురుకానివారిపల్లె గ్రామాల్లో పర్యటించారు. కుష్ఠుపీడితులకు మందులు, పాదరక్షలు, దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అమరనాథ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



గెలుపొందిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

వి.కోట: చిత్తూరులో ఇటీవల నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన మండలానికి చెందిన పురుషుల ఖో–ఖో జట్టు క్రీడాకారులను సోమవారం అభినందించారు. పురుషుల ఖోఖో విభాగంలో పాముగానిపల్లె సచివాలయ పరిధి జట్టు గెలుపొందగా, మహిళల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్టు వ్యాయామోపాధ్యాయుడు సురేష్ తెలిపారు. ఈ రెండు జట్లు ఈనెల 8న విశాఖపట్టణంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడనున్నట్లు తెలిపారు. ఈ జట్లను సర్పంచ్ సుబ్బారెడ్డి, పంచాయతీ సెక్రటరీ వెంకటరమణ, జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాథ్ తదితరులు అభినందించారు.

జగనన్న కాలనీకి బియ్యం బండి నడపాలి



తహసీల్దార్‌కు సమస్య నివేదిస్తున్న కౌన్సిలర్లు

పలమనేరు: పట్టణ సమీపంలోని బొమ్మిదొడ్డి జగనన్న లేఅవుట్‌కు నిత్యావసరాల వాహనాన్ని పంపాలని స్థానిక 13,16 వార్డుల కౌన్సిలర్లు నాగరాజు, శ్యామ్‌సుందర్‌రాజు సోమవారం స్పందనలో స్థానిక తహసీల్దార్‌ను కోరారు. అక్కడి కాలనీలో వందలాది కుటుంబాలు కాపురముంటున్నా సరుకుల బండి వెళ్లడం లేదన్నారు. దీంతో కాలనీవాసులు ప్రతినెలా నిత్యావసర సరుకుల కోసం గతంలోని వారి ఏరియాలకు ఇబ్బందుల నడుమ వెళ్లవలసి వస్తోందని నివేదించారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

వి.కోట: స్థానిక మేజర్ పంచాయతీలోని వ్యవసాయ మార్కెట్‌లో జెడ్పీ నిధులతో సీసీ రోడ్డు పనులను సోమవారం జిల్లా సాంఘిక సంక్షేమ, సామాజికసేవ సలహాదారుడు అమరనాథ్ భూమిపూజ చేసి ప్రారంభించారు. నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు వేయాలని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చలపతి, వార్డు సభ్యుడు క్రిష్టప్ప, పార్టీ నాయకుడు పీఎస్ మంజునాథ్ పాల్గొన్నారు.

ఏనుగుల దాడి: పంటలు నష్టం



నెల్లిమంద వద్ద జంట ఏనుగులు తొక్కేసిన వరి పంట



ఏనుగులు పెకలించిన అరటి చెట్టు

సోమల: ఏనుగులు పంటలపై దాడులు చేసి నష్టం కలిగించాయి. ఆదివారం రాత్రి మండలంలోని నెల్లిమంద పంచాయతీ కమ్మపల్లెకు చెందిన బాషా సాహెబ్, సోమల సమీపంలోని ముంద్రివారిపల్లెకు చెందిన కృష్ణయ్య, చెన్నయ్యగారిపల్లె సమీపంలోని గొల్లపల్లెకు చెందిన సోమశేఖర్, భాస్కర్, రెడ్డెప్పలకు చెందిన మొలక దశలో ఉన్న వరి పైరుపై ఏనుగులు నడుచుకుంటూ వెళ్లడంతో వాటి పాద ముద్రలు పడినచోటులోని పంట దెబ్బతింది. అలాగే పొలాల గట్లపై ఉన్న అరటిచెట్లను తొండంతో పెకలించివేశాయి. ఇవి గ్రామాలకు సమీపంలో సంచరిస్తుండడంతో పాటు వాహనాలు తిరిగే ప్రధాన రహదారుల మీదుగా వెళ్తుండడంతో వాహనదారులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు ఏనుగుల బారి నుంచి తమ పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

మొక్కలు నాటి భూతాపం తగ్గిద్దాం



మొక్కలను నాటుతున్న మల్లిచెట్ల దేవేంద్ర

పలమనేరు: విరివిగా మొక్కలను నాటి భూతాపాన్ని తగ్గించాలని పలమనేరు ప్రకృతి నిర్వాహకులు మల్లిచెట్ల దేవేంద్ర అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆయన రావిమొక్కలను సోమవారం నాటారు. మొక్కలను నాటడంతో మానవాళికి కలిగే మేలును వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో బాలసుందరం, టీచర్లు పాల్గొన్నారు.

ఎవరైనా ఫ్యాన్ గాలికి కొట్టుకుపోవాల్సిందే



కట్టమంచిలో పర్యటిస్తున్న విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కుమ్మక్కై వచ్చినా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో అవన్నీ ఫ్యాన్ గాలికి కొట్టుకుపోవాల్సిందేనని ఆ పార్టీ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి తెలిపారు. స్థానిక కట్టమంచిలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్ని ప్రజలు ఫ్యాన్‌కు ఓటు వేయాలని కోరారు. ఇటీవల మరణించిన ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ధీరజ్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దళితవాడలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించి కట్టమంచి అభివృద్ధి సంక్షేమ సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. సొంత నిధులతో సాంబయ్యకండ్రిగ వరకు రోడ్డు మరమ్మతులు చేపట్టడంపై ప్రాంత వాసులు విజయానందరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కట్టమంచి ప్రాంతంలో ఐక్యత ఎక్కువని అందరూ కలిసి ఎవరిని గెలిపించాలో ముందుగా నిర్ణయించుకుంటారన్నారు. కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు చైర్మన్ రాంగణేష్, నగర పార్టీ అధ్యక్షులు టిమ్ము, కార్పొరేటర్లు స్వరూపరాణి, హరిణిరెడ్డి నాయకులు మనోహర్‌రెడ్డి, కట్టమంచి బాబీ, చిరంజీవి, శేఖర్, వినోద్, సోమశేఖర్‌రెడ్డి, రామ్మూర్తిరెడ్డి, మనోజ్‌రెడ్డి, రజనీ, చిట్టి,హరి, దీన, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటవస్తువులు విరాళం



విద్యార్థులకు ఆటవస్తువులు, స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న దాతలు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పట్టణానికి చెందిన సంఘ సేవకులు సీతారామయ్య, అదే గ్రామానికి చెందిన రత్నాబయోటెక్ అధినేత గంగిరెడ్డి రూ.10వేల విలువజేసే క్రీడా వస్తువులు, స్టడీ మెటీరియల్‌ను సోమ వారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటప్ప, టీచర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు పంపిణీ చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణప్రకాష్

తవణంపల్లె: ఆరోగ్య హెల్త్ కార్డులను వెంటనే పంపిణీ చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ రమణప్రకాష్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేసి లక్ష్యాన్ని అధిగమించాలన్నారు. కులగణన సర్వే ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలన్నారు. ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్లు బాధ్యతాయుతంగా పని చేసి లక్ష్యాన్ని అందుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓ పీఆర్‌డీ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పవిత్రను సన్మానించిన విశ్వ బ్రాహ్మణ సంఘం

వి.కోట: రాష్ట్ర విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నియమితులైన పలమనేరు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్రను సోమవారం మండల విశ్వ బ్రాహ్మణుల సంఘం ఘనంగా సన్మానించింది. తిప్పరత్నచారి, శంకరాచారి, పలువురు విశ్వబ్రాహ్మణులు పాల్గొన్నారు.

బాలికల రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీ మంజూరు

- భవనాల నిర్మాణానికి రూ.28 కోట్లు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మతుకువారిపల్లె సమీపంలో రూ.28 కోట్లతో బాలికల సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాల భవన నిర్మాణానికి ఉత్తర్వులు మంజూరైనట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి సోమవారం తెలిపారు. 5వ తరగతి నుంచి 12వరకు(10+ 2) 640మంది వరకు విద్యార్థులు ఇక్కడ చదవడానికి వీలుంటుందని తెలిపారు. పాఠశాల, కళాశాల మంజూరు చేయించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులకు నూతన పెన్షన్లు



సదుం: పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఎల్లప్ప





పుంగనూరు: లబ్ధిదారుకు పెన్షన్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అర్షద్ అలి, సోమల: కందూరులో..

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో వివిధ కారణాలతో ఆగిపోయిన లబ్ధిదారులందరికీ పెన్షన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని కౌన్సిలర్ అర్షద్ అలి తెలిపారు. సోమవారం నానబాలవీధి సచివాలయం పరిధిలో ఆయన పెన్షన్లు పంపిణీ చేశారు. మొత్తం 72 మందికి పెన్షన్లు మంజూరైనట్టు చెప్పారు.

నేడు పెన్షన్లు పంపిణీ

మండలంలో నూతనంగా మంజూరైన 89 పెన్షన్లను మంగళవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీఓ నారాయణ సోమవారం విలేకరులకు తెలిపారు. సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, ఆయా సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొనాలని ఆయన కోరారు.

కందూరులో..

సోమల: మండలంలోని కందూరులో నూతనంగా మంజూరైన 14 కొత్త పింఛన్లను సోమవారం ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచ్ బాషా మసూద్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

సదుంలో..

సదుం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు అవుతున్నట్టు ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో నూతనంగా మంజూరైన 14 సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు ఆయన సోమవారం పంపిణీ చేసి మాట్లాడారు. సంక్షేమ పథకాలతో పేదలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి ప్రజలు రానున్న ఎన్నికల్లో మరోసారి మద్దతు ఇవ్వాలని కోరారు. సర్పంచ్ ఉషారాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపారంలోనూ రాణించాలి



మెప్మా ఏర్పాటు చేసిన దుకాణాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

- మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి

పలమనేరు: గ్రూపుల్లోని మహిళలు వ్యాపార రంగంలోనూ రాణించాలని పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి ఆకాంక్షించారు. మెప్మా ఆర్థిక సాయం పొంది ఎస్టీ కాలనీలో పట్టణ ప్రగతి యూనిట్ ఏర్పాటు చేసిన వాసవి హోమ్ ఫుడ్స్ దుకాణాన్ని సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రూపుల్లోని మహిళలు రకరకాల వ్యాపారాలతో ఆర్థికంగా బలోపేతం కావడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇలాంటి యూనిట్లు పట్టణంలో మరిన్ని రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా, మెప్మా నిర్వాహకులు, ఆర్‌పీలు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కుష్ఠు నివారణపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎంఓ దయానందం

బైరెడ్డిపల్లె: కుష్ఠు వ్యాధి నివారణపై సోమవారం స్థానిక జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు డీపీఎంఓ దయానందం ఆయన మాట్లాడుతూ, మైకో బాక్టీరియం లెప్రే అనే సూక్ష్మక్రిమి వలన కుష్ఠు వ్యాధి వస్తుందన్నారు. శరీరంపై స్పర్శ, నొప్పి, దళసరి రాగిరంగుతో దురదలేని మచ్చలు ఉన్నపక్షంలో సమీపంలోని ప్రభుత్వాసుపత్రిలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. వ్యాధి ఉన్నట్టు తేలితే క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడితే దాని బారిన నుంచి విముక్తి పొందవచ్చని, ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా మందులు ఇస్తారన్నారు. ఇదలా ఉంచితే, ఈనెల 9న జాతీయ నులిపురుగల నిర్మూలన దినం సందర్భంగా అల్బెండజోల్ మాత్రలు ఇస్తామన్నారు. నులిపురుగుల వలన మానసిక, శారీరక ఎదుగుదల తగ్గి రక్తహీనత, పోషకాహార లోపం సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, సీహెచ్‌ఓ అనూరాధ, హెచ్‌ఎం విశ్వనాథయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



మొహియుద్దీన్

రొంపిచెర్ల: తహసీల్దార్‌గా పి.షేక్ మొహియుద్దీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలలో భాగంగా ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ అమరనాథ్‌ను వైఎస్సార్ కడప జిల్లా వల్లూరుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నంద్యాల జిల్లా సిరివేలు మండలం నుంచి షేక్ మొహియుద్దీన్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

రామకుప్పంలో శ్రీధర్



శ్రీధర్

రామకుప్పం: తహసీల్దార్‌గా శ్రీధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మురళి డిప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. అనంతపురం జిల్లా తలుపుల నుంచి శ్రీధర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. నూతన తహసీల్దార్‌కు రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు.

పుంగనూరులో సుబ్రమణ్యంరెడ్డి



సుబ్రమణ్యంరెడ్డి

పుంగనూరు: తహసీల్దార్‌గా సుబ్రమణ్యంరెడ్డి సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు గ్రామాల్లో మాక్ పోలింగ్, మొబైల్ ఈవీఎంలతో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు.

కుప్పంలో హరికుమార్



హరికుమార్

కుప్పం: కుప్పం తహసీల్దార్‌గా హరికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ పార్వతమ్మ బదిలీపై కర్నూలు జిల్లాకు వెళ్లారు.